సాక్షి
సిద్దిపేట
సోమవారం ၊ 20 ၊ మార్చి ၊ 2023



గురుకులం.. విద్యార్థులకు వరం

2023–24 విద్యా సంవత్సరానికి గురుకుల పాఠశాల 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ మార్చి 20వ తేదీతో ముగియనుంది. 8లో..



కాసులాబాద్‌లో భూ వివాదం

అక్రమంగా భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ఆరోపిస్తూ ఆ వ్యక్తి ఇంటి ఎదుట భూ బాధితులు ఆందోళనకు దిగారు. 8లో..



అన్నదాత.. అతలాకుతలం

జిల్లాలోని ఆయా మండలాల్లో శనివారం రాత్రి, ఆదివారం కురిసిన వర్షానికి చేతికి వచ్చిన పంటలు దెబ్బతిని అన్నదాతకు నష్టాన్ని మిగిల్చాయి. 9లో..

న్యూస్‌రీల్

సమాజహిత కవిత్వం అవసరం



మాట్లాడుతున్న కవి ఎలనాగ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కవిత్వం సమాజహితమై ఉండాలని కవి, రచయిత, అనువాదకుడు ఎలనాగ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన వెన్నల సాహితి సంగమం ఉగాది కవి సమ్మేళన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. భావాల్ని నిక్షిప్తం చేయడం ద్వారా కవిత్వం పూర్తి కాదని, దానిని ఓ తపస్సులా భావించాలని అన్నారు. మనో నిక్షిప్త భావాలను పామరులకు సైతం అర్థమయ్యేలా వివరించగలగాలని అన్నారు. అనంతరం సమ్మేళనంలో పాల్గొన్న 60 మంది కవులను డాక్టర్ సామలసదాశివ ఉగాది పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో చొప్పదండి విద్యాసాగర్, రాంచంద్రరావు, మల్లారెడ్డి, అశోకరాజు, యాదగిరి, మోహన్, మహేందర్, మహిపాల్, యేసురాజు, పద్మ, బాలసరస్వతి, ఉమాశంకర్, రాజు, ప్రవీణ్, కవులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

పద్య సాహిత్యం విలువైంది



పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పద్య సాహిత్యం రాయడం కష్టమని, గద్య సాహిత్యం కంటే పద్య సాహిత్యం విలువైందని జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐత చంద్రయ్య అన్నారు. ఆదివారం సిద్దిపేటలో నిర్వహించిన జాతీయ సాహిత్య పరిషత్ కార్యవర్గ సమావేశంలో అవధాని బండకాడి అంజయ్య గౌడ్ రచించిన శ్రీరేణుకోదాహరణం పుస్తకావిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాత్రానుగుణమైన రచనలు సాహిత్య చరిత్రలో సుస్థిరంగా నిలిచిపోతాయని, శతక పద్యాలు సమాజంలో నీతిని బోధిస్తాయని అన్నారు. జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో మూడు దశాబ్దాలకు పైగా 300లకు పైగా పుస్తకాలను ప్రచురించినట్లు తెలిపారు. నేటి యువత సాహిత్యం వైపు దృష్టి సారించాలని, నూతన ఆలోచనలతో సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో జాతీయ సాహిత్య పరిషత్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఎన్నవెల్లి రాజమౌళి, ప్రధాన కార్యదర్శి ఉండ్రాళ్ళ రాజేశం, వరుకోలు లక్ష్మయ్య, బస్వ రాజ్ కుమార్, కోణం పరశురాములు, గంగాపురం శ్రీనివాస్ పాల్గొన్నారు.

'పరీక్ష పత్రాల లీకేజీ ప్రభుత్వ వైఫల్యమే'



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్: టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రాల లీకేజీతో ఎందరో నిరుద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇది ప్రభుత్వ వైఫల్యమేనని ఫిషర్‌మెన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి గౌటి బాబేష్ అన్నారు. ఆదివారం నారాయణరావుపేట మండల కేంద్రంలో సీఎం కేసీఆర్, ఐటీ మినిస్టర్ కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. రాష్ట్రం వస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని ఆశ పడితే నిరాశే ఎదురవుతోందని అన్నారు. టీఎస్‌పీఎస్సీని కల్వకుంట్ల కుటుంబం దారాదత్తం చేసుకొని పేపర్లు లీక్ చేయిస్తోందని ఆరోపించారు. రాబోయే ఎలక్షన్‌లో నిరుద్యోగులు బీఆర్‌ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు బిట్ల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు రాజేశం గౌడ్, రూరల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రమేష్, బండి శివ కుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఏడుపాయలలో భక్తుల కిటకిట

పాపన్నపేట(మెదక్): ఎల్లలు దాటి తరలివచ్చిన భక్తులతో ఏడుపాయల కిటకిటలాడింది. ఆదివారం ఉదయం భక్తులు మంజీర నదిలో స్నానాలు చేసి దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారికి బోనాలు తీసి, ఒడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. పోలీసులు భద్రతను పర్యవేక్షించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

- భారీగా తరలివచ్చిన భక్తులు
- మారుమోగిన మల్లన్న ఆలయం
- అర్ధరాత్రి తర్వాత అగ్ని గుండాలు ప్రారంభం



రాజగోపురం ఎదుట భక్తుల సందడి

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్న నామస్మరణ నడుమ, శివసత్తుల పూనకాలు, నెత్తిన బోనం, ఒడిబియ్యంతో ప్రత్యేక పూజలు, పట్నాల మధ్య తొమ్మిది వారాల పాటు సాగిన బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. మూడు నెలల పాటు సాగిన వేడుకల్లో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని పులకించారు. తిథి, వార నక్షత్రాల ఆధారంగా ఈ ఏడాది 9 వారాల పాటు ఉత్సవాలు వైభవంగా జరిగాయి. చివరి వారం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తొమ్మిదో వారం వీరశైవ ఆగమ శాస్త్రం ప్రకారం కార్యక్రమాలు నిర్వహించారు. అర్ధరాత్రి నిర్వహించే అగ్ని గుండాలతో ముగుస్తాయి. సుమారు 10 లక్షల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో బుకింగ్ ఆదాయంతో పాటు హుండీ ఆదాయం భారీగానే సమకూరినట్లు తెలుస్తోంది.

కిటకిటలాడిన ఆలయ పరిసరాలు..

మల్లన్న నామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. శనివారం రాత్రి నుంచి క్షేత్రానికి చేరుకున్న భక్తులు వసతి, ప్రయివేటు గదులను అద్దెకు తీసుకొని బస చేశారు. వేకువజామున తలనీలాలు సమర్పించి, పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. గంగిరేణి చెట్టువద్ద ముడుపులు, పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారికి నిత్యకల్యాణం, ఒడిబియ్యం, అర్చన, బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు కొండపై రేణుక ఎల్లమ్మ అమ్మ వారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో దర్శనానికి సుమారు 4 గంటల సమయం పట్టింది. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, ఈఓ బాలాజీ, ఏఈఓ అంజయ్య, ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్ పరిశీలించారు.

దర్శించుకున్న ప్రముఖులు

కొమురవెల్లి మల్లికార్జున స్వామిని హైకోర్టు న్యాయమూర్తి వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకురాలు కొండా సురేఖ వేర్వేరుగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ బాలాజీ, ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిగుండాలకు ఏర్పాట్లు

మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి ఘట్టమైన అగ్నిగుండాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. అగ్నిగుండాలు నిర్వహించే తోట బావి ప్రాంగణంలో మొరం పోసి చదును చేశారు. కొబ్బరి, మామిడి ఆకులతో అందంగా అలంకరించారు. అగ్నిగుండాలను దాటేందుకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పోలీస్‌శాఖ గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు.



గంగిరేణి చెట్టు వద్ద భక్తుల కోలాహలం



పట్నాలు వేస్తున్న భక్తులు



బెజ్జంకి మండలం లక్ష్మీపూర్‌లో నేలవాలిన మొక్కజొన్న

అకాల వర్షం.. రైతన్న ఆగం

- పిడుగుపాటుతో రెండు పాడిగేదెలు మృతి
- 1,890 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- నష్టం అంచనా వేసిన వ్యవసాయ అధికారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలో శనివారం రాత్రి, ఆదివారం ఉదయం కురిసిన వర్షం రైతులకు తీరని నష్టం మిగిల్చింది. జిల్లా వ్యాప్తంగా 92.9 సెం.మీ వర్షపాతం నమోదవగా, సగటున 3.9సెం.మీల వర్షపాతం కురిసింది. అక్కన్నపేట మండల పరిధిలోని పోతారం (జె) గ్రామంలో రైతు జగ్గయ్యకు చెందిన రెండు పాడి గేదెలు పిడుగుపాటుకు మృతి చెందాయి. బెజ్జంకి మండలంలో మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పర్యటించారు. వ్యవసాయ అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి, పంట నష్టంపై ప్రాథమిక అంచనా వేశారు.

తీరని నష్టం

అత్యధికంగా తొగుట మండలంలో 7.9సెంమీ, సిద్దిపేట అర్బన్ మండలంలో 7.2సెం.మీ, కొహెడ మండలంలో 6.9సెం.మీ, హుస్నాబాద్ మండలంలో 6 సెం.మీ, చిన్నకోడూరు మండలంలో 5.8సెం.మీ, నారాయణరావుపేట మండలంలో 4.8సెం.మీ, నంగునూరు మండలంలో 4.3సెం.మీల వర్షపాతం నమోదైంది. వర్షంతో నంగునూరు మండలంలో 550 ఎకరాల్లో మొక్కజొన్న, బెజ్జంకి మండలంలో 373 ఎకరాలు, 40 ఎకరాల్లో పొద్దుతిరుగుడు, తొగుట మండలంలో 60 ఎకరాల మొక్కజొన్న, 106 ఎకరాల్లో పొద్దుతిరుగుడు, కోహెడ మండలంలో 87 ఎకరాల్లో వరి, 380 ఎకరాల్లో మొక్కజొన్న, 10 ఎకరాల్లో పొద్దుతిరుగుడు, జగదేవ్‌పూర్ మండలంలో 56 ఎకరాల్లో వరి, 118 ఎకరాల్లో మొక్కజొన్న, సిద్దిపేట రూరల్ మండలంలో 15 ఎకరాల్లో మొక్కజొన్న, 8 ఎకరాల్లో పొద్దుతిరుగుడు, హుస్నాబాద్ మండలంలో 14 ఎకరాల్లో మొక్కజొన్న, గజ్వేల్ మండలంలో 63 ఎకరాల్లో మొక్కజొన్న, చిన్నకోడూరు మండలంలో 10 ఎకరాల్లో మొక్కజొన్న, 6 ఎకరాల్లో మామిడి కలిపి మొత్తం జిల్లా వ్యాప్తంగా 1,890 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వర్షంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

యాసంగిలో సాగైన పంటల వివరాలు

	సాగు(ఎకరాల్లో)	పాడైంది
వరి	3,46,797	143
మొక్కజొన్న	16,683	1,583
పొద్దుతిరుగుడు	7228	164

మొక్కజొన్నకు తీవ్ర నష్టం



జిల్లాలో శని, ఆదివారాల్లో జిల్లా వ్యాప్తంగా 92.9 సెంమీ వర్షపాతం కురిసింది. వ్యవసాయాధికారులు ఆయా మండలాల్లో పర్యటించారు. 1583 ఎకరాల్లో మొక్కజొన్న, 143 ఎకరాల్లో వరి, 164 ఎకరాల్లో పొద్దుతిరుగుడు పంటలకు నష్టం జరిగింది. మొత్తంగా 1,890 ఎకరాల్లో పంటలు వర్షం కారణంగా దెబ్బతిన్నాయి.

– శివప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి

న్యాయ వ్యవస్థపై నమ్మకం పెంచాలి



మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి వెంకటేశ్వర్‌రెడ్డి

- హైకోర్టు న్యాయమూర్తి వెంకటేశ్వర్‌రెడ్డి
- సిద్దిపేటలో అడిషనల్ సీనియర్ సివిల్ కోర్టుకు ప్రారంభోత్సవం

సిద్దిపేటకమాన్: కక్షిదారులకు సత్వర న్యాయం అందించి, న్యాయ వ్యవస్థపై నమ్మకం పెంచాలని హైకోర్టు న్యాయమూర్తి వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట కోర్టు సముదాయంలో ఏర్పాటు చేసిన అడిషినల్ సీనియర్ సివిల్ కోర్టును జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ రఘురాంతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థను న్యాయవ్యవస్థ జోడెడ్ల బండి లాంటిదని, న్యాయమూర్తులు, న్యాయవాదులు సమన్వయంతో పనిచేయాలన్నారు. న్యాయవాదులు అనవసర వాయిదాలకు వెళ్లకుండా కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి భవాని, సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సల్మాఫాతిమా, అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రావణియాదవ్, జడ్జిలు ప్రియాంక, సౌమ్య, శివరంజని, కృష్ణతేజ, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, కార్యదర్శి మంతూరి సత్యనారాయణ, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవునూరి రవీందర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు హరిశ్చంద్ర, సాయిబాబ, రాజేశ్వర్‌రెడ్డి, శివాజీ, ప్రకాష్, రాజలింగం, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కమిషనర్ పూజలు



ఆలయ సభ్యులతో కమిషనర్ శ్రీకాంత్‌రావు

గజ్వేల్: గజ్వేల్ పట్టణంలోని సీతారామ ఉమామహేశ్వర ఆలయాన్ని ఆదివారం దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ తోట శ్రీకాంత్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయనకు ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు దేశపతి రాజశేఖరశర్మ, నందబాలశర్మ, సాయి పంతుల, మఠం నవీన్‌కుమార్ ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కళ్యాన్‌కర్ నర్సింగరావు, ఎన్‌సీ శ్రీనివాస్, జంగం రమేశ్‌గౌడ్, తూం శ్రీధర్, తోట అమరేందర్‌రావు, ప్రసాద్, సిలివేరి జనార్దన్ తదితరులున్నారు.

కేసీఆర్ పథకాలే బీఆర్‌ఎస్‌కు శ్రీరామరక్ష

మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

గజ్వేల్: కేసీఆర్ పథకాలే బీఆర్‌ఎస్ పార్టీకి శ్రీరామరక్ష అని మెదక్ ఎంపీ, బీఆర్‌ఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం గజ్వేల్‌లోని ఎస్-కన్వెన్షన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్యులతో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి పార్టీ పరిశీలకుడు, ఎమ్మెల్సీ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమాన్ని కొత్త పుంతలు తొక్కించి తెలంగాణను దేశానికే దిక్సూచిగా మలిచిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కార్యకర్తల సంక్షేమంలోనూ బీఆర్‌ఎస్ తనకంటూ ప్రత్యేకతను చాటుకుంటోందని కొనియాడారు. జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ఈనెల 26న గజ్వేల్ మండలం, 29న మర్కూక్, ఏప్రిల్ 2న కొండపాక, 3న కుకునూర్‌పల్లి, 4న మనోహరాబాద్, 5న ములుగు, 6న జగదేవ్‌పూర్, 7న తూప్రాన్ మండలం, 13న గజ్వేల్ మున్సిపాలిటీ, 9న వర్గల్, 12న తూప్రాన్ మున్సిపాలిటీల్లో సమ్మేళనాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమ్మేళనంలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, గజ్వేల్, వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్లు మాదాసు శ్రీనివాస్, జహంగీర్, బీఆర్‌ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామంతో విడదీయలేని బంధం



మాట్లాడుతున్న శివానందప్రసాద్

హైకోర్టు అడ్వకేట్ జనరల్ బండ శివానందప్రసాద్

మద్దూరు(హుస్నాబాద్): గ్రామంతో తనకు విడదీయలేని బంధం ఉందని, గ్రామాభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం అందిస్తానని రాష్ట్ర హైకోర్టు అడ్వకేట్ జనరల్ బండ శివానందప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని లద్నూరు గ్రామంలో బండ కుటుంబ ఆత్మీయ సమ్మేళంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు నాయకులు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వగ్రామం లద్నూరు ప్రజలతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, న్యాయవాద విద్య చదవాలనుకునే విద్యార్థులు తనను సంప్రదిస్తే సహాయ సహకారం అందిస్తానని తెలిపారు. కవయిత్రి డాక్టర్ బండ సరోజన మాట్లాడుతూ తాను విద్యనభ్యసించిన పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష అందిస్తానని ప్రకటించారు. కన్న తల్లిని, జన్మనిచ్చిన ఊరు, చదివిన పాఠశాల, మాతృభాషను ఎన్నిటికీ మరువొద్దని పేర్కొన్నారు. రానున్న పదో తరగతి పరీక్షలో తెలుగులో అధిక శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులను అందివనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య, బీఆర్‌ఎస్ మండల నాయకులు పుట్ట వెంకటరమణరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి, ఉపసర్పంచ్ బెడద కుమరస్వామి, కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ కాసర్ల కనుకరాజు, పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మి నర్సయ్య, గ్రామస్తులు రాంమూర్తి, ప్రకాశం, పాశికంటి వెంకటరమణ, తహసీల్దార్ భూపతి, నాయకులు రామడుగు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'పది' ప్రణాళిక

- ఏప్రిల్ 3 నుంచి వార్షిక పరీక్షలు
- వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ముందుకు
- 10 జీపీఏపై దృష్టిసారించిన అధికారులు



లచ్చపేట మోడల్ స్కూల్లో ప్రత్యేక తరగతులు

దుబ్బాక: పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ అధికారులు ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ, రివిజన్‌పై దృష్టి సారించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఏప్రిల్ 3వ తేది నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉత్తమ గ్రేడ్ సాధించేందుకు విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఉపాధ్యాయులు సైతం విద్యార్థులు 10 జీపీఏ సాధించేలా ప్రణాళికలు రూపొందించి అమలు పరుస్తున్నారు.

ప్రత్యేక తరగతులు..

మండలంలో 23 ప్రభుత్వ పాఠశాలలో మొత్తం 677 మంది విద్యార్థులు 10 వ తరగతి చదువుతున్నారు. దుబ్బాకతో పాటు, రాజక్కపేట, లచ్చపేట, ధర్మాజీపేట, చీకోడ్‌తో పాటు 18 జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, లచ్చపేట మోడల్ స్కూల్, కస్తూర్బా, మైనార్టీ రెసిడెన్షియల్, ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాలు ఉన్నాయి. వంద శాంత ఉత్తీర్ణత సాధించేందుకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థుల నుంచి ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు.

తల్లిదండ్రులు సహకరించాలి



ఈ ఏడాది పదో తరగతిలో మెరుగైన ఉత్తీర్ణత సాధించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ సందేహాలను నివృత్తి చేస్తున్నాం. విద్యార్థులు చక్కగా చదివి పరీక్షలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు సహకరించాలి.

– ప్రభుదాస్, మండల విద్యాధికారి, దుబ్బాక

10 జీపీఏ లక్ష్యం



ఏప్రిల్ నెలలో జరిగే 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 10 జీపీఏ లక్ష్యంగా ప్రణాళిక రూపొందిచుకున్నాను. పాఠలశాలలో స్టడీ అవర్స్ సమయంలో నాకు వచ్చే సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేస్తున్నారు.

– ఆనందిని, 10వ తరగతి, జెడ్పీహెచ్ఎస్, దుబ్బాక

ప్రత్యేకంతో ఉపయోగం



పదో తరగతిలో 10 జీపీఏ సాధించేందుకు పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు ఎంతగానో దోహదపడుతున్నాయి. మాకు వచ్చే సందేహాలను ఉపాధ్యాయులు వెంట వెంటనే నివృత్తి చేస్తున్నారు. సబ్జెక్టుల వారిగా ప్రత్యేక దృష్టి సారించి ఉత్తమ ఫలితాలే ధ్యేయంగా కృషి చేస్తున్నారు.

– రేవతి, 10వ తరగతి, జెడ్పీహెచ్ఎస్, దుబ్బాక

గురుకులం.. విద్యార్థులకు వరం

ఐదో తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులు

- నేటితో ముగియనున్న గడువు
- ఏప్రిల్ 23వ తేదీన ప్రవేశ పరీక్ష

కొండాపూర్(సంగారెడ్డి): ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్యను అందిస్తూ కార్పొరేట్‌కు దీటుగా గురుకుల పాఠశాలలు విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాయి. కార్పొరేట్ పాఠశాలలో కేవలం విద్యకు మాత్రమే ప్రాధాన్యతను ఇస్తే గురుకులాల్లో విద్యతో పాటు ఆటలకూ ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజులు చెల్లించలేని పేద కుటుంబాల పిల్లలకు గురుకులాలు వరంగా మారాయి. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన విద్యార్థులు గురుకుల పాఠశాలలకు చెందిన వారే కావడంతో కొన్నేళ్లుగా తమ పిల్లలను గురుకుల పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ ప్రారంభమైంది. ఫిబ్రవరి 9వ తేదీ నుంచి మార్చి 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. దీనికి సంబంధించిన ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23వ తేదీ ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు జరగనుంది.

పరీక్ష రాసేందుకు అర్హతలు

- ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతూ ఉండాలి.



గిర్మాపూర్ గురుకుల పాఠశాల

- తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలలో రూ 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాలలో రూ.2 లక్షలకు మించకూడదు.
- గురుకులాల్లో సన్నబియ్యంతో సహా అన్ని పోషక విలువలు కలిగిన రుచికరమైన భోజనం, వసతి సౌకర్యం, మూడు జతల యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోటుబుక్‌లు ఉచితంగా ఇస్తారు.
- నెలలో నాలుగు సార్లు చికెన్, రెండు సార్లు మటన్‌తో భోజనమే కాకుండా వారంలో నాలుగు రోజులు కోడిగుడ్లు, ఆరు రోజులు పండ్లు ఇస్తారు.
- సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 12 గురుకులాలు ఉన్నాయి. మెదక్ జిల్లా వ్యాప్తంగా 4 గురుకులాలు ఉన్నాయి. ఒక్కో గురుకులంలో 5వ తరగతికి సంబంధించి 80 సీట్లు ఉంటాయి.
- ఈ 80 సీట్లలో ఎస్సీలకు 60, ఎస్సీ సి 3, ఎస్టీ 4, బీసీలకు 10, ఓసీ 1, మైనార్టీలకు 2 సీట్లు కేటాయించారు.

దరఖాస్తు చేసుకోవడం ఇలా

- టీఎస్ ఆన్‌లైన్, మీసేవా, ఈసేవా కేంద్రాలలో http:// trwrier.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ అప్లికేషన్‌కోసం విద్యార్థులు రూ.100 చెల్లించాల్సి ఉంటుంది.
- తప్పుడు సమాచారం ఇచ్చినా, మరొకరి ఫొటోతో దరఖాస్తు చేసినా వారిపై చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు.
- మరింత సమాచారం కోసం ఉచిత హెల్ప్‌లైన్ 180042545678 నంబర్‌కు ఫోన్‌చేసి సంప్రదించాలి.

ఎంపిక ప్రక్రియ

- గణితం, సైన్స్, తెలుగు, మెంటల్ ఎబిలిటీ అంశాలపై 100 మార్కులు ఉంటాయి.
- వచ్చిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.
- మెరిట్ లిస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- ఎంపిక అనంతరం విద్యార్థుల కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తారు.
- ప్రభుత్వ పాఠశాలల మాదిరిగానే జూన్‌లో తరగతులు ప్రారంభమవుతాయి.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



సంగారెడ్డిలో 12, మెదక్‌లో 4 గురుకుల పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశించేందుకు దరఖాస్తు చేసుకునేందుకు నేడు ఆఖరు రోజు. పేద విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. గురుకులాల్లో ఇంగ్లీషు మీడియం ద్వారా విద్యా బోధన అందించడంతో పాటు అన్ని రకాల సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుంది.

– భీమయ్య, ఆర్‌సీఓ

క్లుప్తంగా

సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి



శ్రీనివాస్ రెడ్డి

పాపన్నపేట(మెదక్): సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడిగా ఆదివారం శ్రీనివాస్‌రెడ్డి ఎంపికయ్యారు. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం మల్లంపేటకు చెందిన శ్రీనివాస్‌రెడ్డి 15 ఏళ్ళుగా సింగపూర్ సిటీ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. సింగపూర్‌లోని తెలుగు వారి ఐక్యత, సంస్కృతీ సాంప్రదాయాల పరిరక్షణకు 1975 లో ఎస్‌టీఎస్ ఏర్పాటు చేశారు. ఇందులో 10 వేల మంది సభ్యులున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా విజయవాడకు చెందిన బొమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడిగా తాను ఎన్నికైనట్లు శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు.

పెచ్చులూడుతున్న పంచాయతీ భవనం పైకప్పు



కంచన్‌పల్లి గ్రామ పంచాయతీ భవనం పెచ్చులూడి పడిన దృశ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రామ పంచాయతీ భవనం శిథిలమవుతోంది. ఆదివారం మండలంలోని కంచన్‌పల్లి గ్రామ పంచాయతీ భవనం వరండ వద్ద గ్రామస్తులు, గ్రామసేవకులు కూర్చున్నారు. ఒక్కసారిగా పైకప్పు పెచ్చులు ఊడి కిందపడ్డాయి. ఎవరూ గాయపడలేదు. గ్రామపంచాయతీ భవనం శిథిలావస్థకు చేరడంతో పెచ్చులూడుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. నూతన భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో నిర్మాణం చేపట్టనున్నట్లు సర్పంచ్ రజినీ సుధాకర్ తెలిపారు.

చెట్టు నరికిన వ్యక్తికి జరిమానా

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): చెట్టును నరికిన వ్యక్తికి మున్సిపల్ అధికారులు జరిమానా విధించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని 21వ వార్డులో సయ్యద్ రియాజ్ నిబంధనలకు విరుద్ధంగా హరితహారం చెట్టును నరికివేయంతో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రాజనర్సు, మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ ఆదేశాలతో హరితహారం అధికారి ఐలయ్య రియాజ్‌కు రూ.10 వేలు జరిమానా విధించారు.

ఉపాధ్యాయులకు ఉగాది పురస్కారం



కిషన్‌నాయక్, తిరుపతి

చిన్నశంకరంపేట(మెదక్): సిద్దిపేట జిల్లా కేంద్రంలో వెన్నల సాహితి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది కవి సమ్మేళనంలో మండలంలోని మిర్జాపల్లి జెడ్పీపాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కిషన్ నాయక్, శేరిపల్లి జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు తిరుపతి ఉగాది పురస్కారం అందుకున్నాడు. ఆదివారం సిద్దిపేటలో జరిగిన ప్రముఖ కవి, విమర్శకులు ఎలనాగు చేతులమీదుగా పురస్కారం అందుకున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

క్షేమంగా ఇంటికి చేరిన విద్యార్థి

తొగుట(దుబ్బాక): మండలంలోని చందాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థి బొడ్డు కనకరాజు (15) క్షేమంగా ఇంటికి చేరుకున్నాడు. శనివారం సాయంత్రం మిత్రులతో కలిసి ఆడుకునేందుకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో భయాందోళనకు గురైన తల్లిదండ్రులు స్వామి, రజిత గ్రామంలో వెతికారు. తెలిసినవారిని విచారించినా అతడి ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం బాలుడు ఇంటికి చేరుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

మహిళా సాధికారతకు నిరంతర పోరాటం



మాట్లాడుతున్న భారత జాతీయ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తేల సృజన

హుస్నాబాద్: మహిళా సాధికారతకోసం నిరంతరం పోరాటం సాగిస్తామని భారత జాతీయ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తేల సృజన అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని అనబేరి, సింగిరెడ్డి అమరుల భవన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మహిళల హక్కులను పోరాడి సాధించుకోవాలని, చదువు, నైపుణ్యంలో మహిళలు ముందంజలో ఉండాలన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేసేందుకు పాలకులు కృషి చేయాలన్నారు. మహిళలు, బాలికలు, పిల్లలు, వృద్ధుల రక్షణకు చట్టాలను కఠినం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, నాయకులు శంకర్, రజిని, మమతా, నిర్మల, స్వాతి, శోభ తదితరులు ఉన్నారు.

ఆవుకు అంత్యక్రియలు

రాయికోడ్(అందోల్): మండలంలోని శంషాద్దీన్‌పూర్ గ్రామంలో మల్లికార్జున స్వామి దేవాలయానికి విడిచిన ఆవు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. నిత్యం గ్రామంలోని ఇంటింటికి తిరిగే ఆవుకు గ్రామస్తులు పూజలు చేసి ఆహారం అందించేవారు. ఆవు మృతి చెందడంతో గ్రామస్తులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచ్ సర్పంచ్, గ్రామస్తులు మృతి చెందిన ఆవుకు అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో నియోజక వర్గ కురుమ సంఘం ఉపాధ్యక్షుడు నాగభూషణం, గ్రామస్తులు స్వామి, రాములు విఠల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల ఆగ్రహం



బిల్లును చూపుతున్న వినియోగదారులు

అల్లాదుర్గం(మెదక్): గృహ విద్యుత్ బిల్లులు అధిక మొత్తంలో రావడంతో ఆగ్రహించిన వినియోగదారులు విద్యుత్ సిబ్బందిపై మండిపడ్డారు. తగ్గించేవరకు బిల్లులు చెల్లించమని విద్యుత్ సిబ్బందిని వెనకకు పంపారు. ఆదివారం గడిపెద్దాపూర్ గ్రామంలో గృహ అవసరాలకు వినియోగిస్తున్న విద్యుత్ బిల్లులు రూ.2 వేల నుంచి 10 వేల వరకు రావడంతో ఆందోళన చెందారు. కొంతమందికి పాత మీటర్లే ఉన్నాయని, డిజిటల్ మీటర్లు పెట్టుకోలేదన్నారు. రూ.20 వేల నుంచి 30 వేల వరకు బిల్లులు రావడంతో విస్మయం చెందారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది చెప్పిందే వేదమని, అధికంగా బిల్లులు వచ్చాయని మొరపెట్టుకుంటే ఒక్కరూ స్పందించరని ఆవేదన వ్యక్తం చేశారు. బడాబాబులకు మాత్రం తక్కువ బిల్లులు ఎలా వస్తాయని వారు ప్రశ్నిస్తున్నారు. జిల్లా విద్యుత్ అధికారులు స్పందించకుంటే గ్రామం నుంచి ఒక్క రూపాయి కూడా చెల్లించమన్నారు. మూడు రోజులలో భారీ ధర్నా చేపడ్తామని వారు హెచ్చరించారు.

కాసులాబాద్‌లో భూ వివాదం



వంటా వార్పులో భోజనం చేస్తున్న భూ బాధితులు

వంటా వార్పుతో బాధితుల ఆందోళన

మిరుదొడ్డి(దుబ్బాక): అక్రమంగా భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ఆరోపిస్తూ ఆ వ్యక్తి ఇంటి ముందు భూ బాధితులు ఆందోళనకు దిగారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించే ప్రసక్తే లేదంటూ స్పష్టం చేశారు. ఈ సంఘటన మండల పరిధిలోని కాసులాబాద్‌లో ఆదివారం చోటు చేసుకుంది. భూ బాధితులు, గ్రామస్తులు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ర్యాగట్ల లింగం, ర్యాగట్ల నందం అన్నదమ్ములు. వీరికి తాతముత్తాల నుంచి సంక్రమించిన 441 నంబర్ గల భూ సర్వేలో 52 గుంటల భూమి ఉంది. ఆ భూమిలో వారు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో కొద్ది రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన తాటి భానుచందర్ అక్రమంగా 52 గుంటల భూమిని తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. భానుచందర్ అక్రమంగా తమ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడన్న విషయం తెలుసుకున్న లింగం, నందం కలిసి గ్రామ సర్పంచ్ తుమ్మల బాల్‌రాజు సమక్షంలో పంచాయతీ నిర్వహించారు. తను రిజిస్ట్రేషన్ చేయించుకున్న 52 గుంటల భూమిని ర్యాగట్ల వారి పేరున భూ రిజిస్ట్రేషన్ చేస్తానని పెద్దల సమక్షంలో భానుచందర్ మాట ఇచ్చాడు. ఇచ్చిన మాట ప్రకారం భానుచందర్ భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండా జాప్యం చేస్తుండటంతో బాధితులు అతడిని మూడు రోజుల క్రితం గ్రామంలో నిలదీశారు. భానుచందర్‌పై భూ బాధితులు దాడి చేసే అవకాశం ఉండటంతో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా ఆదివారం భానుచందర్ ఇంటి ముందు భూ బాధితులు కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగారు. అక్కడే వంటా వార్పు నిర్వహించారు. సమస్య పరిష్కారమయ్యే వారకు ఆందోళన కొనసాగిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు



మిర్జాపల్లి శివారులో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని ఢీకొన్న కారు

చిన్నశంకరంపేట(మెదక్): రోడ్డు మరమ్మతుల్లో భాగంగా వేసిన కంకరుపై వెళ్తున్న కారు అదుపు తప్పి నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని ఢీకొంది. ఈ సంఘటనలో పలువురు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు వాసులు కారులో ఆదివారం మండలంలోని మిర్జాపల్లి వచ్చారు. తిరిగి ఆర్మూర్ వెళ్తుండగా మిర్జాపల్లి తండా రోడ్డు పక్కన ఉన్న బ్రిడ్జి వద్ద కారు అదుపుతప్పడంతో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న వారు గాయపడ్డారు. స్థానికులు వారిని కాపాడారు. రోడ్డు మరమ్మతులు నత్తనడకన సాగుతుండటంతో తరచూ వాహన ప్రమాదాలు జరుగుతున్నాయని మిర్జాపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

మద్యం మత్తులో మురికి కాలువలోపడి ..

యువకుడి మృతి



ప్రవీణ్(ఫైల్)

మర్కుక్(గజ్వేల్): బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొని మురికి కాలువలో పడటంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మర్కుక్ మండల కేంద్రంలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరీశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మర్కుక్ గ్రామానికి చెందిన ప్రవీణ్ (23) శనివారం సాయంత్రం గ్రామ సమీపంలోని వైన్స్ వద్ద మద్యం తాగి బైక్‌పై తన ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఇంటి సమీపంలో వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొని పక్కనే ఉన్న మురికి కాలువలో పడిపోయాడు. రాత్రంతా మురికి కాలువలో పడి ఉండడంతో మృతి చెందాడు. ఆదివారం ఉదయం అటువైపు వెళుతున్న కొంతమంది గ్రామస్తులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో మృతుడి మామ మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి


- ఇద్దరికి స్వల్పగాయాలు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరికి గాయపడ్డారు. మృతుల్లో వృద్ధుడు ఉన్నాడు. ట్రాక్టర్‌పై రింగ్ రోడ్డు పనులకు కూలీలు వెళ్తున్నారు. బైక్ అడ్డురావడంతో పక్కకు తప్పించబోయి అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ట్రాక్టర్ ఇంజిన్ తిరగబడి కూలి మృతి చెందాడు.



సత్యవాన్ నాందేవ్ మృతదేహం

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రమాదవశాత్తు అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడటంతో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని రామునిపట్ల వద్ద ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్రకు చెందిన సత్యవాన్ నాందేవ్ షెడ్మాకె (42), కృష్ణ, ముఖేష్ మనోజ్ మండే సిద్దిపేట ఔటర్ రింగ్ రోడ్డు పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం గంగాపూర్ క్యాంప్ నుంచి ట్రాక్టర్‌లో పొలమాలకు బయలుదేరారు. రామునిపట్ల శివారులోకి రాగానే బైక్ అడ్డురావడంతో దానిని తప్పించే క్రమంలో ట్రాక్టర్‌ను పక్కకు తీసుకోవడంతో బోల్తా పడింది. డ్రైవర్ కృష్ణ, ఇంజన్‌పై కూర్చున్న ముఖేష్ మనోజ్‌లు పక్కకు దూకారు. ఇంజన్‌పై మరోవైపు కూర్చున్న సత్యవాన్ నాందేవ్‌పై ఇంజన్ పడటం అక్కడికక్కడే మృతి చెందాడు. పక్కకు దూకిన ఇద్దరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రింగ్ రోడ్డు కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.



బోల్తా పడ్డ ట్రాక్టర్ ఇంజన్‌కింద సత్యవాన్ నాందేవ్ మృతదేహం

చికిత్స పొందుతున్న వృద్ధుడు..

పటాన్‌చెరు టౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వృద్ధుడు గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ దుర్గయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మారేపల్లి గ్రామానికి చెందిన నర్సింలు గౌడ్ (60) శనివారం ఉదయం ఇంటి నుంచి బయలు దేరి బస్సులో పటాన్‌చెరు వచ్చాడు. బస్టాండ్‌లో బస్సు దిగి నడుచుకుంటూ రేణుకా ఎల్లమ్మ దేవాలయం వెనుక ఉన్న ఈదుళ్ల వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో పటాన్‌చెరు పాత మార్కెట్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం వెంటనే బీరంగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: మద్యం మత్తులో గుర్తుతెలియని విషం తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆదివారం అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ గణేశ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రా నికి చెందిన సాయిలు(45), భార్య రామ్‌బాయ్ దంపతులు పదేళ్ల క్రితం బతుకుదెరువు కోసం వచ్చారు. అమీన్‌పూర్ పరిధిలోని హెచ్‌ఎంటీ స్వర్ణ పురి కాలనీలో నివాసం ఉంటున్నారు. సాయిలు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. అయితే మద్యానికి బానిసైన సాయిలు పనిచేయకుండా తిరుగుతున్నాడు. తాగొచ్చి భార్య, పిల్లలతో గొడవపడేవాడు. ఈ క్రమంలో పనిఉందని ఈనెల 17వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి 18వ తేదీ మధ్యాహ్నం మద్యం మత్తులో వచ్చాడు. వెంట తెచ్చుకున్న గుర్తుతెలియని విషం తాగడంతో వెంటనే గమనించిన భార్య అతడిని చికిత్స కోసం మదీనగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లింది, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. సమాచారతెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్ట ం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల పాడిగేదెలు, ఆవుల మృత్యువాత

శనివారం రాత్రి అకాల వర్షంతో కూడిన పిడుగుపాటుకు మూడు పాడి గేదెలు, మూడు లేగదూడలు మృత్యువాతపడ్డాయి. రైతులు రోజు మాదిరిగానే తమ పొలాల్లో గేదెలను కట్టేసి ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం వచ్చి చూడగా మృతి చెంది కనిపించాయి. అలాగే పాముకాటుతో, పశువుల పాక కూలి మూడు ఆవులు మృతి చెందాయి. పశువుల మృతితో తమకు జీవనాధారం పోయిందని వాపోయారు. ప్రభుత్వం పాడి రైతులకు ఆర్థిక సాయం అందజేసి ఆదుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



అక్కన్నపేట(హుస్నాబాద్): పోతారం(జె) గ్రామంలో.. మృతి చెందిన గేదెలు

అక్కన్నపేట(హుస్నాబాద్): పిడుగుపాటుకు పాడి గేదెలు మృతి చెందాయి. ఈ సంఘటన అక్కన్నపేట మండలం పోతారం(జె) గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చిర్రం జంగయ్య రోజు మాదిరిగానే శనివారం రాత్రి తన వ్యవసాయ బావి వద్ద పశువులను కట్టేసి ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం పొలానికి వద్దకు వెళ్లి చూడగా మృతిచెందిన పాడిగేదెలు కనిపించాయి. బాధిత రైతును ఆదుకోవాలని గ్రామ సర్పంచ్ కరివేద ప్రమీల ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

పాముకాటుతో ఎద్దు ..

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని మాచేపల్లిలో పాముకాటుతో ఎద్దు మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మాచేపల్లి గ్రామానికి చెందిన రమావత్ చందర్ తన ఎద్దులను రోజుమాదిరిగానే శనివారం సాయంత్రం కొట్టంలో కట్టేశాడు. అక్కడ పాము కాటు వేయడంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ మండల నాయకుడు పడమటి అనంత్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని రైతును ఓదార్చారు. తనవంతు సహాయంగా రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశాడు.

పిడుగు పాటుతో ..

మద్దూరు(హుస్నాబాద్): పిడుగు పాటుతో పాడి గేదె మృతి చెందింది. ఈ సంఘటన దూళ్మిట్ట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఆదివారం బాధిత రైతు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు దుబ్బడు శ్రీనివాస్ రెడ్డి రోజు మాదిరిగానే తన పొలం వద్ద పాడిగేదెను కట్టేసి ఇంటికి వచ్చాడు. శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి పిడుగు పడి పాడిగేదె మృతి చెంది కనిపించింది. గేదె విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని బాధితుడు వాపోయాడు.

పశువుల పాక కూలి ఆవులు..

చేగుంట(తూప్రాన్): అకాల వర్షంలో బలమైన ఈదురుగాలులకు పశువుల పాక కూలి రెండు ఆవులు మృతి చెందాయి. ఈ సంఘటన మండలంలోని కర్నాల్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఆదివారం గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సాయిరాంగౌడ్, రాంచంద్రంగౌడ్‌కు చెందిన పొలంవద్ద ఉన్న పశువుల పాక ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి కూలిపోయింది. దీంతో పాకలోని రెండు ఆవులు మృతి చెందగా మరో రెండు ఆవులు తీవ్రంగా గాయపడ్డాయి.



మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్టలో ..

విషయం తెలుసుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌యాదవ్ గ్రామానికి చేరుకొని సర్పంచ్ సంతోష్‌రెడ్డితో కలిసి పంచనామా నిర్వహించారు. వివరాల నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్లు తెలిపారు. ఆవుల మృతితో రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

పిడుగుపడి లేగదూడలు..



కొండపాక(గజ్వేల్): దుద్దెడలో ..

కొండపాక(గజ్వేల్): అకాల వర్షంలో పిడుగుపడి లేగదూడలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన కొండపాక మండలంలోని దుద్దెడ గ్రామంలో చోటు చేసుకుంది. బాధిత మహిళ తలమైన వెంకటమ్మ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం రాత్రి ఇంటి సమీపంలోని చెట్టుకు లేగదూడలను కట్టేసింది. ఆదివారం తెల్లవారుజామున పిడుగు పడి మూడు లేగదూడలు మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు విజ్ఞప్తి చేసింది.

అన్నదాత.. అతలాకుతలం

- దెబ్బతిన్న మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, వరి పంటలు
- గ్రామాల్లో పర్యటించిన వ్యవసాయాధికారులు
- బెజ్జంకిలో పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే రసమయి బాలకిషన్


బెజ్జంకి(సిద్దిపేట): లక్ష్మీపూర్‌లో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రసమయి

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణం, మండలంలో శనివారం రాత్రి ఉరుములు, గాలులతో కూడిన వర్షంతో చేతికి వచ్చిన పంటలు నేలవాలి నష్టాన్ని కలిగించాయి. హుస్నాబాద్ పట్టణంలో మరో 15 రోజుల్లో పంట చేతికి వచ్చే సమయానికి వర్షాలు పడి చేనుల్లో నీళ్లు నిలిచి పొట్టకు వచ్చిన వరిపంట నేలపాలైంది. అలాగే గాంధీనగర్‌లో మొక్కజొన్న పంట నేలవారి తీవ్రంగా నష్టపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

తొగుట(దుబ్బాక): మండలంలో వెంకట్రావుపేట, కాన్గల్, గుడికందుల, ఎల్లారెడ్డిపేట, పెద్దమాసాన్‌పల్లి, గోవర్ధనగిరి, వరదరాజుపలి, లింగాపూర్ గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. మండలంలో సుమారు 250 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగింది. మండల వ్యవసాయాధికారి మోహన్ ఆదివారం మండలంలో పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించారు. పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. చేతికొచ్చిన పంట నష్టపోయామని మానవత్వంతో ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

261 ఎకరాల్లో పంట నష్టం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని వడగండ్ల వర్షానికి పలు గ్రామాల్లో పంట నష్టం జరిగింది. ఆదివారం మండల వ్యవసాయ అధికారి వసంతరావు వెంకటాపూర్, తిమ్మాపూర్, ఎల్లాయిగూడ, అనంతసాగర్, బస్వాపూర్, మునిగడప, గోపాల్‌పూర్, ఇటిక్యాల, అలిరాజ్‌పేట గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. వరి 56, మొక్కజొన్న 118 ఎకరాలు, కూరగాయలు 187 ఎకరాల్లో నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా వేశారు. మండలంలోని 38.6 మి.మీ వర్షం నమోదైందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

రైతులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే రసమయి

బెజ్జంకి(సిద్దిపేట): అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు సహాయమందేలా చూస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సూచించారు. మండలంలోని వీరాపూర్, లక్ష్మీపూర్, గూడెం గ్రామాల్లో ఆయన ఆదివారం పర్యటించి ధ్వంసమైన మొక్కజొన్న చేలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బెజ్జంకితో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో నష్టపోయిన మొక్కజొన్న, మామిడి తదితర పంటల వివరాలను సేకరించాలని వ్యవసాయ, రెవెన్యు అధికారులకు సూచించామన్నారు. నివేదికలను ప్రభుత్వానికి అందజేసి సహాయమందేలా చూస్తామని తెలిపారు. సీఎం కేసీఆర్ రైతులను ఆదుకోవాలని తక్షణమే సమావేశాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, ఏఓ సంతోష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కచ్చు రాజయ్య, వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గుప్తా, సంజీవరెడ్డి, లక్ష్మణ్, తిరుపతి, దేవేందర్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు తదితర పంటలు దెబ్బతిని రైతులకు నష్టాన్ని మిగిల్చాయి. నష్టపోయిన పంటలను బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేశం, కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్ సుధాకర్, తిరుపతిరెడ్డి, బాలకిషన్, శ్రీనివాస్‌తో పాటు ఆయా పార్టీ నాయకులు పరిశీలించారు.

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని పిడిచెడ్, అహ్మదీపూర్‌తో పాటు గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని క్యాసారంలో వడగండ్ల వర్షం కురవడంతో ఆయా గ్రామాల్లో రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు గజ్వేల్ మండల వ్యవసాయాధికారి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయా గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటచేలను పరిశీలించినట్లు తెలిపారు. మండలంలో సుమారు 63 ఎకరాల్లో రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశామని, ప్రాథమిక నివేదికను జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయానికి పంపించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు నర్సింలు, శ్రీహరి, ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలో కురిసిన అకాల వర్షం, ఈదురు గాలులకు మొక్కజొన్న, పొద్దుతిరుగుడు తదితర పంటలు ధ్వంసమయ్యాయి. పంటలు చేతికొచ్చే దశలో వర్షం రావడంతో రైతులకు భారీ నష్టం వాటిల్లింది. మండలంలో 373 ఎకరాల్లో మొక్కజొన్న, సుమారు 40 ఎకరాల్లో పొద్దుతిరుగుడు పంటకు నష్టం వాటిల్లినట్లు ఏఓ సంతోష్ తెలిపారు.


గజ్వేల్‌రూరల్: మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి నాగరాజు


హుస్నాబాద్: గాంధీనగర్‌లో నేలవాలిన మొక్కజొన్న


కోహెడరూరల్(హుస్నాబాద్): దెబ్బతిన్న పొద్దుతిరుగుడు


వెంకట్రావుపేటలో పంటలను పరిశీలిస్తున్న ఏఓ మోహన్


హుస్నాబాద్: పొలంలో నిలిచిన నీరు


జగదేవ్‌పూర్(గజ్వేల్): అలిరాజ్‌పేటలో..


తొగుట: కాన్గల్‌లో నేలవాలిన మొక్కజొన్న

క్లుప్తంగా

జనచైతన్య యాత్రను జయప్రదం చేయండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): బీజేపీ అవలంభిస్తున్న మతోన్మాద, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా సీపీఐఎం అఖిల భారత కమిటీ పిలుపు మేరకు ఈ నెల 23వ తేదీ నుంచి 29 వరకు నిర్వహించనున్న జనచైతన్య యాత్రను జయప్రదం చేయాలని సీపీఐఎం మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని ఆకునూరులో జన చైతన్య యాత్ర వాల్‌పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. చైతన్య యాత్రలో అధిక సంఖ్యలో నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఈ నెల 27న జిల్లా కేంద్రంలో జరిగే జన చైతన్యయాత్ర బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, శ్రీకాంత్, సంపత్, చంద్రయ్య, శివయ్య, యాదగిరి, కనకయ్య, మల్లయ్య, కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ షర్మిలను కలిసిన నాయకులు


షర్మిలకు సమస్యలను వివరిస్తున్న నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): సిరిసిల్లలో నవీన్ అనే నిరుద్యోగ యువకుడి ఆత్మహత్యకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని వైఎస్సార్‌టీపీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ఎదుల్ల నర్సింహరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సిరిసిల్లలో ఆత్మహత్య చేసుకున్న నవీన్ కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్తున్న వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిలకు జిల్లా సరిహద్దులో స్వాగతం పలికారు. ఆయన వెంట నాయకులు గురునాథం, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నంగునూరు(సిద్దిపేట): సిరిసిల్లలో ఆత్మహత్య చేసుకున్న నవీన్ కుటుంబాన్ని ఓదార్చి తిరుగు ప్రయాణంలో హరిత హోటల్‌కు చేరుకున్న వైఎస్ షర్మిలను వైఎస్సార్‌టీపీ నంగునూరు మండల కన్వీనర్ ఎండీ ఇమ్రాన్‌తో పాటు మండల నాయకులు కలిశారు. సిద్దిపేట నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను షర్మిలకు వివరించినట్లు వారు తెలిపారు.

గజ్వేల్‌లో నేడు మహాధర్నా

గజ్వేల్: తెలంగాణలోని 33 జిల్లాలకు చెందిన డీఎస్సీ–2008 మెరిట్ అభ్యర్థులకు సంబంధించి గతేడాది సెప్టెంబర్ 27న హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం డీఎస్సీ–2008 రాష్ట్ర బీఈడీ మెరిట్ క్యాండిడేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గజ్వేల్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి ఫరీద్, గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్‌లు తెలిపారు. ఆదివారం గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. డీఎస్సీ–2008 మెరిట్ అభ్యర్థులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని హైకోర్టు స్పష్టంగా తీర్పునిచ్చినా, ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని వాపోయారు. ఈ సమస్య తీవ్రతను చాటేందుకే గజ్వేల్‌లో మహాధర్నా నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వాలు

దుబ్బాక: ప్రజావ్యతిరేఖ విధానాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని దుబ్బాక నియోజకవర్గ టీడీపీ పార్టీ కో–ఆర్డినేటర్ ఇల్లేందుల రమేశ్ అన్నారు. రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఆదేశాల మేరకు దౌల్తాబాద్ మండలంలోని శేరుపల్లి, బందారం, అహ్మద్‌నగర్, నర్సంపల్లి, ముబారస్‌పూర్ గ్రామాల్లో ఇంటింటికీ తెలుగు దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేశ్, నర్సింలు, నారాగౌడ్, స్వామి, రాములు, ర్యాకం రవీందర్, ఎల్లయ్య , జహంగీర్ తదితరులున్నారు.

విద్యారంగంపై నిర్లక్ష్యం వీడాలి

గజ్వేల్‌రూరల్: రాష్ట్రంలో అవినీతి పాలన సాగిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి మద్యంపై ఉన్న శ్రద్ధ విద్యారంగంపై లేదని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నాయిని యాదగిరి ఆరోపించారు. ఆదివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ఒకే ఒక్క నోటిఫికేషన్ విడుదల చేసినా ప్రశ్నాపత్రం లీకేజీతో బంగారు భవిష్యత్‌పై ఆశలు పెట్టుకున్న నిరుద్యోగ యువత అయోమయంలో పడిపోయిందన్నారు. పేపర్ లీకేజీకి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గోపాల్‌రావు, మండల శాఖ అధ్యక్షుడు మల్లారెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి రాములుగౌడ్, నాయకులు ఆంజనేయులు, శివుడు, సాయికుమార్, మల్లారెడ్డి, బాబా పాల్గొన్నారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

మంత్రి హరీశ్‌రావును కలిసిన సెర్ప్ ఉద్యోగులు


మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఉద్యోగులు

సిద్దిపేటజోన్: సెర్ప్ ఉద్యోగులకు కొత్త పేస్కేల్ వర్తింపజేస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేయడంపై సెర్ప్ ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు సిద్దిపేట నియోజకవర్గ పరిధిలోని ఉద్యోగులు ఆదివారం హైదరాబాద్‌లో ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావును కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. తమకు కొత్త పేస్కేల్, జీఓ జారీ చేయడంలో కీలకపాత్ర పోషించిన మంత్రి హరీశ్‌రావు, అదేవిధంగా సీఎం కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రజలందరూ సుఖ సంతోషంగా ఉండాలి


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామంలో ఆదివారం నిర్వహించిన మహాలింగేశ్వరస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ తనవంతుగా 2 లక్షల 86వేల రూపాయల విలువల గల ఇనుము, సిమెంట్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ లకావత్ మానస, సర్పంచ్ రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు కృషి


చేర్యాల(సిద్దిపేట): నివాళులర్పిస్తున్న నాయకులు


దుబ్బాకలో..

చేర్యాల(సిద్దిపేట): కీర్తి శేషులు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం ఆశయ స్ఫూర్తితో నేటి పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని సీపీఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు దాసరి కళావతి పిలుపునిచ్చారు. ఆదివారం కామ్రేడ్ మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి వేడుకలను స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరాజ్యం చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌మావో, శ్రీహరి, ప్రశాంత్, శ్రీనివాస్, భాస్కర్, రంజిత్‌రెడ్డి, లక్ష్మి పాల్గొన్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట): తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ఆశయాలతో నేటి పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాంసాగర్ సర్పంచ్ తాడూరి రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి, అత్తిని శారద, మండల కమిటీ సభ్యులు తాడూరి మల్లేశం, బక్కెల్లి బాలకిషన్, నీల భిక్షపతి, సార్ల యాదయ్య, ఆరుట్ల రవీందర్ పాల్గొన్నారు.

దుబ్బాక: మల్లు స్వారాజ్యం గొప్ప యోధురాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొడ్డుబర్ల భాస్కర్ అన్నారు. ఆదివారం పురస్కరించుకుని దుబ్బాక పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం కార్యకర్తలు రాజు, శంకర్, శ్రీనివాస్, బాల్‌రాజు, అల్లాఉద్దీన్ ఉన్నారు.

గజ్వేల్‌రూరల్: మల్లు స్వరాజ్యం సేవలు మరువలేనివని సీపీఎం గజ్వేల్ కమిటీ నాయకులు అన్నారు. ఆదివారం గజ్వేల్‌లో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ.. భూస్వామ్య కుటుంబంలో పుట్టి నిరుపేదల కోసం పరితపించిన వ్యక్తి మల్లు స్వరాజ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు రంగారెడ్డి, స్వామి, యాదగిరి, నర్సింలు, స్వామి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దేవక్కపల్లె సర్పంచ్ కరవేద విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం గ్రామస్తులు పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా మహిళలు బోనాలతో వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించి నైవేద్యాలు సమర్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు.

కోహెడ(హుస్నాబాద్): కోహెడ మాల కులస్తులు పోచమ్మకు బోనాలు చేశారు. మహిళలు బోనాలు ఎత్తుకొని డప్పుచప్పుళ్లతో అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లారు. భక్తిశ్రద్ధలతో నైవేద్యం సమర్పించారు.


కోహెడలో బోనాలతో వెళ్తున్న మహిళలు

వైభవంగా ఉమామహేశ్వర ఆలయ వార్షికోత్సవం

కొండపాక(గజ్వేల్): మంచిని ధైర్యంగా ఆచరించడమే దైవ తత్వమని పీఠాధిపతులు మాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బ్రాహ్మణులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామికి భక్తులు అభిషేకాలు చేశారు. అనంతరం హోమం నిర్వహించారు. మాధవానంద సరస్వతీ స్వామికి పాదపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన వితరణ చేశారు.


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ట్రస్మా ఆధ్వర్యంలో ఒలంపియాడ్ టెస్ట్

సిద్దిపేటజోన్: ట్రస్మా ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ప్రతిభ కళాశాలలో సెమీ ఒలంపియాడ్ టెస్ట్ నిర్వహించారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సాయిరాం హాజరై పరీక్షా పత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ట్రస్మా ప్రతినిధులు పోకల సంతోష్‌కుమార్, సంజీవరెడ్డి, హరినాథ్, శ్రీనివాస్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి


క్రికెట్ కిట్‌ను అందిస్తున్న రంగారావు

నంగునూరు(సిద్దిపేట): సిద్దిపేటలో జరుగుతున్న కేసీఆర్ క్రికెట్ ట్రోఫీలో యువకులు మంచి ప్రతిభ కనబర్చడం హర్షనీయమని కల్వకుంట్ల రంగారావు ఫౌండేషన్ చైర్మన్ వంశీధర్‌రావు అన్నారు. నంగునూరు మండలం నుంచి క్రికెట్ పోటీలో పాల్గొంటున్న 49 జట్లకు ఆదివారం క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రవి, సురేందర్‌గౌడ్, సిద్దులు, సంపత్, గిరి పాల్గొన్నారు.

అన్నమయ్య వర్ధంతి


అన్నమయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

సిద్దిపేటజోన్: అన్నమాచార్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో అన్నమయ్య 520వ వర్ధంతి నిర్వహించారు. పట్టణంలోని వేంకటేశ్వర ఆలయం వద్ద ఉన్న అన్నమయ్య విగ్రహానికి పూలమాలలు వేసి అభిషేక అర్చన చేశారు. అనంతరం అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. కార్యక్రమంలో గాయకుడు పవన్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక


ఎంపీ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

దుబ్బాకటౌన్: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎంపీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దౌల్తాబాద్ మండలం మాచిన్‌పల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు మామిండ్ల ప్రభాకర్, నాగరాజు, పాపయ్య, జానీ, మల్లయ్య, భూషణం, తదితరులకు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు సోలిపేట సతీశ్‌రెడ్డి, దౌల్తాబాద్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, తదితరులున్నారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే

దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి


దౌల్తాబాద్‌లో దీక్ష చేస్తున్న నాయకులు

దుబ్బాక: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాయపోల్, దౌల్తాబాద్ మండలాల్లో ఎక్కడ చూసినా సమస్యలే తప్పా అభివృద్ధి కనుమరుగైందన్నారు. దౌల్తాబాద్ మండలంలో ఇంటర్మీడియట్ కళాశాలను తీసుకొచ్చిన ఘనత దివంగత ఎమ్మెల్యే చెరుకు ముత్యంరెడ్డికే దక్కుతుందన్నారు. దొంగ హామీలతో ఉపఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే రఘునందన్‌రావు నియోజకవర్గానికి చేసిందేమి లేదని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల పతనం తప్పదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరేందర్‌రెడ్డి, స్వామి, వేణు, రాములు, దశరథరెడ్డి, రవి తదితరులున్నారు.

పేపర్ లీకేజీ చేసిన వారిపై చర్య తీసుకోవాలి


చేర్యాల(సిద్దిపేట): దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్టలో

జగదేవ్‌పూర్(గజ్వేల్): పేపర్ లీకేజీ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు ఆదివారం జగదేవ్‌పూర్‌లో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను గాంధీ చౌరస్తాలో దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రావణ్, నాయకులు శ్రీకాంత్, లోకేశ్, రూపేశ్, కృష్ణ, అజీజ్, భాను పాల్గొన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): గ్రూప్ వన్ ప్రశ్నా పత్రం లీకేజీని నిరసిస్తూ దూళ్మిట్ట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, కేటీఆర్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రూప్‌వన్ పేపర్ లీకేజీల్లో కేటీఆర్ హస్తం ఉందని ఆయన ఆరోపించారు. విద్యాశాఖపై అవగాహన లేని మంత్రి సబితా ఇంద్రారెడ్డిని వెంటనే భర్తరఫ్ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ మండల అధ్యక్షుడు చెట్కూరి కమలాకర్‌యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షులు కనకరాములు, శ్రీనివాస్, వెంకటేశ్, మహేశ్, అనిల్, రాజు పాల్గొన్నారు.

హుస్నాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, జిల్లా బాధ్యులు యాదవరెడ్డి, మండల అధ్యక్షుడు బంక చందు, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, లావణ్య, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు బోనగిరి రజిత, నాయకులు ఉన్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని రసులాబాద్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గురువయ్యగౌడ్, అయిలయ్యగౌడ్, పరశురాములు,శ్రీకాంత్, నర్సింలు, కృష్ణ పాల్గొన్నారు.

కొండపాక(గజ్వేల్): కొండపాక మండలంలోని వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద రాజీవ్ రహదారిపై సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను, కుకునూరుపల్లి మండల కేంద్రంలో మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను ఆదివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాసరి లింగారావు, విరుపాక శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో వేర్వేరుగా దహనం చేశారు. కార్యక్రమంలో సేవాదళ్ అధ్యక్షుడు ప్రతాప్‌చందర్, ఉపసర్పంచ్ నర్సింగరావు, నాయకులు రెడ్డమైన రవీందర్, కనుకయ్య, వీరేశం, బారుగు యాదగిరి, స్వామి, సిద్దులు, ఐలయ్య, సుధాకర్, బ్రహ్మం, శివ, సత్యం, రవి, నరేశ్, శేఖర్, శ్రీను, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని నాగపురి గ్రామంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ కొండల్‌రెడ్డి, నాయకులు రవి, శంకర్, శ్రీనివాస్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణాలను పూర్తిస్థాయిలో మాఫీ చేయాలి

హుస్నాబాద్: రైతుల రుణాలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో మాఫీ చేయాలని రైతు ఐక్యత సంఘం నాయకులు అన్నారు. ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాల క్రితం తీసుకున్న వ్యవసాయ రుణాలు రూ.35వేలకే పరిమితం చేయడం దారుణమన్నారు. లక్ష రూపాయలు రుణం తీసుకున్న రైతులు వడ్డీ పేరుతో ఇప్పటికే రూ.40వేలు చెల్లించారన్నారు. వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడం, గిట్టుబాటు ధరలు, పంటలు పండకపోవడం ఇవన్నీ తట్టుకొని రైతు మార్కెట్లో నిలబడుతుంటే, ప్రోత్సాహకాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. తక్షణమే పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, ఆశయ్య, నాగయ్య, రవీందర్, అయిలయ్య, రాజయ్య తదితరులు ఉన్నారు.